

జీసీసీ గోదాంలో అగ్ని ప్రమాదం
ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న జీసీసీకి సంబంధించిన గన్నీ సంచుల నిలువ గోదాంలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. 8లో▸



బాసర గోదావరికి హారతి
మాఘమాసం ద్వాదశి పురస్కరించుకుని బాసరలో గంగాహారతి నిర్వహించారు. వేద భారతి పీఠం విద్యార్థులు గోదావరినదికి హారతి పట్టారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
35.0/21.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. చలి ప్రభావం చాలా వరకు తగ్గనుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం



మాట్లాడుతున్న కేశవులు

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని ఉత్తర తెలంగాణ అభివృద్ధి ఫోరం చైర్మన్ డాక్టర్ కేశవులు అన్నారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధిపై జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నా అభివృద్ధి మాత్రం కొన్ని ప్రాంతాలకే పరిమితమైందన్నారు. ఉత్తర తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో నీరు, ఖనిజ సంపదతో పాటు వనరులున్నా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో నిలిచిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా ఇంకా ఆర్టీసీ బస్సులు వెళ్లలేని గ్రామాలు అనేకం ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీలు, సంఘాల నాయకులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్, జగన్ సింగ్, సంగెపు బొర్రన్న పాల్గొన్నారు.

సామాజిక సేవ అభినందనీయం



నూతన కార్యవర్గ సభ్యులతో డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: డెంటల్ అసోసియేషన్ సభ్యులు సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్షుడు సాయిరాం, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యసేవలు అందించేలా కృషి చేయాలని సూచించారు. అలాగే అసోసియేషన్ అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ఇందులో వైద్యులు కళ్యాణ్‌రెడ్డి, ప్రకాశ్, ప్రమోద్ రెడ్డి, సమీయొద్దిన్, ఐడీఏ కోశాధికారి సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షులు స్వప్నిల్,రత్న,సంయుక్త కార్యదర్శి నిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

కులవృత్తుల బలోపేతానికే 'విశ్వకర్మ'

ఆదిలాబాద్‌రూరల్: కుల వృత్తులను ఆర్థికంగా బలోపేతం చేయడానికే కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని తీసుకువచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు అన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో భాగంగా ఏడు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న స్వర్ణకారులకు రాంనగర్ శిక్షణ కేంద్రంలో ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తులకు ఆర్థికంగా మరింత చేయూతనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి షూరిటీ లేకుండా వ్యాపారం కోసం రుణాలు మంజూరు చేస్తుందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్, స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి సత్యం, శిక్షకులు ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా



కాలువ వద్ద పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

తాంసి: మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రాజెక్టు ఎడమ కాలువను ఏఈ హరీశ్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. కాలువలో పలు చోట్ల పేరుకుపోయిన తుంగతో పాటు దెబ్బతిన్న లైనింగ్‌ను పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది పోచన్న ఉన్నారు.

అమ్మకు కడుపుకోత

వైద్య ఆరోగ్యశాఖ ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. ప్రసవ సమయంలో అత్యవసరం అయితే తప్ప సిజేరియన్ చేయకూడదని నిబంధనలు ఉన్నా కొన్ని ఆస్పత్రులు వాటిని అతిక్రమిస్తున్నాయి. కాసులకు కక్కుర్తి పడి అమ్మ కడుపునకు కోతలు మిగుల్చుతున్నారు. దీంతో తల్లులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ కాన్పుతో ఆరోగ్యంగా ఉండాల్సిన వారు సిజేరియన్‌తో మూడు నెలల పాటు మంచానికే పరిమితం అవుతున్నారు. దీంతో రెక్కాడితే కానీ డొక్కాడని పేద కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతోంది. అలాగే వీరికి దీర్ఘకాలిక సమస్యలూ ఎదురవుతున్నాయి. పుట్టిన బిడ్డకు పాలు ఇవ్వడంలో జాప్యం తప్పడం లేదు. అలాగే నవజాత శిశు మరణాలు సంభవిస్తున్నాయి. నెలలు నిండకుండానే సిజేరియన్ చేయడంతో తల్లిదండ్రుల ఇక్కట్లు వర్ణనాతీతమే. పసికందులను నెలల తరబడి ఆస్పత్రుల్లో ఉంచాల్సిన దుస్థితి. సిజేరియన్లను తగ్గించి నార్మల్ డెలివరీలను పెంచేందుకు ప్రభుత్వం అనేక పోత్సాహకాలను అందిస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. – ఆదిలాబాద్‌టౌన్



- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే 'సాధారణ' ప్రసవాలు
- ప్రైవేట్‌లో సిజేరియన్ కాన్పులే అధికం
- కాసులకు కక్కుర్తి పడుతున్న నిర్వాహకులు

వివరాలు ..

డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు జిల్లాలో కాన్పులు **12,184**

	ప్రభుత్వ ఆస్పత్రుల్లో	ప్రైవేట్ ఆస్పత్రుల్లో
మొత్తం ప్రసవాలు	7,757	3,976
నార్మల్ డెలివరీలు	5,662	673
సిజేరియన్లు	2,095	3,303

కాన్పు కోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిన గర్భిణులకు వైద్యులు ఎక్కువగా శస్త్ర చికిత్స చేసి ప్రసవం చేస్తున్నారు. ప్రతీ పది మందిలో ఒకరో ఇద్దరికి మాత్రమే సాధారణ ప్రసవం అవుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. నార్మల్ డెలివరీతో ప్రైవేట్ ఆస్పత్రుల వారికి అనుకున్నంత కాసులు వచ్చే పరిస్థితి ఉండదు. దీంతో వారు ఎక్కువగా కడుపు కోతలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆస్పత్రికి చేరిన వెంటనే ఏదో ఒక సమస్యను చూపి వెంటనే ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని, లేకుంటే తల్లీబిడ్డకు ప్రమాదమని చెప్పి కుటుంబీకులను భయాందోళనకు గురి చేస్తున్నారు. గత్యంతరం లేక సిజేరియన్‌కు ఒప్పుకున్న తర్వాత వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. పిల్లల వైద్యుడు, మత్తు డాక్టర్, ఆపరేషన్ చేసే సమయంలో వాడే మందులు, ఇతర ఖర్చులు భరించాల్సి ఉంటుంది. రోజుకు బెడ్‌కు రూ.2వేల నుంచి ఆపై వసూలుచేస్తున్నారు. సిజేరియన్‌కు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు తీసుకుంటున్నారు. బిడ్డ ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకుంటే వెంటిలెటర్లో పెట్టి మరింతగా దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు కొంత మంది మంచి రోజు చూసి నెలలు నిండక ముందే కాన్పు కోసం ఆస్పత్రికి చేరుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ ఆస్పత్రుల వారు దండుకుంటున్నారు. అయితే సిజేరియన్ చేయడంతో బాలింత మూడు నెలల పాటు మంచానికే పరిమితం కావాల్సి ఉంటుంది. అలాగే బలహీనంగా మారుతారు. ఆపరేషన్ చేసిన చోట ఇన్‌ఫెక్షన్ వస్తుంది. పుట్టిన బిడ్డకు సైతం సరిగ్గా పాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడుతుంది. దీర్ఘకాలికంగా ఆరోగ్య సమస్యలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇక సాధారణ ప్రసవం అయితే వారం రోజుల్లోగానే అన్ని పనులు చేసుకోవచ్చు. పుట్టిన బిడ్డ కూడా యాక్టివ్‌గా ఉండే అవకాశాలుంటాయి.

83 శాతం కోతలే..

2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు జిల్లాలో జరిగిన మొత్తం ప్రసవాల్లో 64 శాతం వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నమోదయ్యాయి. వీటిలో 73 శాతం సాధారణ ప్రసవాలు ఉండగా, కేవలం 27 శాతం మందికి మాత్రమే ఆపరేషన్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మొత్తం ప్రసవాల్లో కేవలం 17 శాతం మాత్రమే సాధారణ ప్రసవాలు ఉండగా.. 83 శాతం సిజేరియన్లు నమోదవడం గమనార్హం. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిన గర్భిణులకు నొప్పులు అనుభవించాల్సి న పరిస్థితి రావడం లేదు. కొంత మంది నొప్పుల భయంతో ముందుగానే సిజేరియన్‌కు ఒప్పుకుంటున్నారు. మొదటి కాన్పు ఆపరేషన్ చేస్తే ఆ తర్వాత కాన్పులకూ శస్త్ర చికిత్స అనివార్యమవుతుంది. ఇది ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులకు కాసుల వర్షం కురుస్తోంది.

హెచ్చరికలు జారీ చేస్తున్నాం..



ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో సమావేశాలు నిర్వహించి సిజేరియన్లు చేయవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నాం. తరచూ సమావేశాలు కూడా నిర్వహిస్తున్నాం. గతేడాది ప్రైవేట్‌లో 86 శాతం సిజేరియన్లు జరగగా, ప్రస్తుతం 80 శాతానికి తీసుకొచ్చాం. జిల్లాలో 22 పీహెచ్‌సీలు ఉండగా, 10 పీహెచ్‌సీల్లో దాదాపు అన్ని సాధారణ ప్రసవాలే జరుగుతున్నాయి. గర్భిణికి ఇబ్బంది ఉంటే తప్పా సిజేరియన్ చేయడం లేదు. ఆపరేషన్‌తో కొంత ఇబ్బందులు ఎదురవుతాయి.
– డాక్టర్ నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

'ప్రత్యేక'మా.. పొడిగింపా?

- 14న ముగియనున్న 'సహకార' పాలకవర్గాల గడువు
- ఆరు నెలల వరకు ఎన్నికలు అనుమానమే
- పదవీకాలం పొడిగించాలని కోరుతున్న చైర్మన్లు
- స్పెషలాఫీసర్ల నియామకానికి అధికారుల కసరత్తు



తాంసిలోని పీఏసీఎస్ కేంద్రం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో...

మొత్తం సహకార సంఘాలు : 77
డీసీసీబీ : 01
డీసీఎంఎస్: 01
సొసైటీల పరిధిలోని సభ్యులు : 55వేలు

కైలాస్‌నగర్: అన్నదాతకు సాగుపరమైన సేవలనందిస్తూ వారికి క్షేత్రస్థాయిలో అండగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల గడువు ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. వీటికి ఇప్పట్లో ఎన్నికల నిర్వహణ జరిగే అవకాశం కనిపించడం లేదు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల మాదిరిగానే ప్రత్యేకాధికారుల పాలన అనివార్యం కానున్నట్లు తె లుస్తోంది. అయితే ప్రభుత్వం గడువు పొడిగిస్తుందా లేక ప్రత్యేకాధికారుల పాలనకే గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే సొసైటీల ప్రత్యేకాధికారుల నియామకానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సహకారశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

14న ముగియనున్న పదవీకాలం

పీఏసీఎస్‌లకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 14న ఎన్నికలు నిర్వహించింది. సొసైటీ పరిధిలో ఎన్నికైన చైర్మన్లతో అదే నెల 25న డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. పలువురు డైరెక్టర్లను సైతం ఎన్నుకున్నారు. ఈ పాలకవర్గాల గడువు ఈ నెల 14తో పూర్తవుతుంది. సాధారణంగా సొసైటీల కాలపరిమితి ముగిసే ఆరు నెలల ముందుగానే ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియ చేపడుతుంది. గడువు వరకు పూర్తిచేసేది. అయితే ప్రస్తుతం వీటి నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కూడా కనిపించడం లేదు. దీంతో ప్రత్యేకాధికారుల పాల న అనివార్యంగా మారింది. అయితే పలువురు అధికార పార్టీ డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు తమ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పాలకవర్గాల గడువును పొడిగిస్తుందా లేక ప్రత్యేకాధికారుల పాలనకే ఆసక్తి చూపుతుందా అనే దానిపై ఆసక్తికరంగా మారింది.

రైతుకు వెన్నుదన్నుగా..

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు సాగుపరంగా అవసరమైన ఎరువులు, విత్తనాలు, పంట రుణాలను క్షేత్రస్థాయిలో అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నాయి. పలు సొసైటీలు ధాన్యం కొనుగోళ్లను సైతం చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇవన్నీ ఆదిలాబాద్ కేంద్రంగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ), జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్(డీసీఎంఎస్) ఆధ్వర్యంలోనే రైతులకు సేవలందిస్తున్నాయి.

ప్రత్యేకాధికారుల నియామకాలకు కసరత్తు

ప్రత్యేక పాలనకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు. అయితే పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు ప్రభుత్వం ఇప్పటికే స్పెషలాఫీసర్లను నియమించిన సంగతి తెలిసిందే. సహకార సంఘాలకు సైతం అదే మాదిరిగా ప్రత్యేధికారుల పాలనకే మొగ్గు చూపే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సహకార శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఎంపీడీవో, తహసీల్దార్ స్థాయి అధికారులను సొసైటీలకు ప్రత్యేకాధికారులుగా నియమించవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సొసైటీకి ఒక్కో ప్రత్యేకాధికారిని నియమిస్తారా లేక రెండు, మూడు సొసైటీలను కలిపి వారిని నియమిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

ఎలాంటి ఆదేశాలు అందలేదు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల గడువు ఈనెల 14వ తేదీతో ముగియనుంది. అయితే ప్రత్యేకాధికారులను నియమిస్తుందా లేక పాలకవర్గాల గడువు పొడిగిస్తుందా అనేదానిపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం. – బి.మోహన్, జిల్లా సహకార శాఖ అధికారి

స్కాలర్‌షిప్.. ఇక్కట్లు

- ఆధార్, ఎస్సెస్సీ మెమోలో పేరు ఒకేలా ఉండాల్సిందే
- లేకుంటే దరఖాస్తుకు అనుమతించని వైనం
- ఎస్సీ విద్యార్థులకు తప్పని తిప్పలు
- మార్పు కోసం ఆధార్ సెంటర్ల బాట



పదో తరగతి మెమోలోని పేరుకు ఆధార్ పేరు సరిపోలేదంటూ చూపిస్తున్న వెబ్‌సైట్

బోథ్: ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎస్సీ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60, 40 శాతం వాటాతో ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందివ్వనున్నాయి. బోధన ఫీజులు, ఉపకార వేతనాలను వారి అకౌంట్లలో జమ చేయనున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దరఖాస్తు విధానాన్ని రూపొందించింది. ఈ క్రమంలో ఈ ఏడాది నుంచి అప్లికేషన్ ప్రక్రియ కూడా మారింది. ఇందులో భాగంగా విద్యార్థి మొదటి దశలో తన పదో తరగతి మెమోలో ఉన్న పేరు, ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రెండింటిలో పేరు ఒకేలా ఉంటేనే ప్రక్రియ ముందుగు సాగుతుంది. లేకపోతే సమీపంలో ఉన్న ఆధార్ సెంటర్‌లో పేరులో మార్పు చేసుకోవాలని సూచిస్తోంది. ఇలాంటి వారంతా ఆధార్ కేంద్రాలకు పరుగు పెడుతున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ ఇతర కోర్సులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ఈ నిబంధనతో ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు గతేడాది డిసెంబర్ 31తో స్కాలర్‌షిప్ దరఖాస్తు ప్రక్రియ ముగియగా, ప్రభుత్వం మార్చి 31వరకు పొడిగించింది.

మందకొడిగా దరఖాస్తులు

జిల్లాలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్ దరఖాస్తులు చాలా తక్కువగా వచ్చాయి. సగం మంది కూడా అప్లై చేసుకోలేదని సమాచారం. దరఖాస్తు ప్రక్రియ విధానంలో మార్పుతో పాటు ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డులో పేరు ఒకేలా ఉండాలనే నిబంధన ఇందుకు కారణంగా తెలుస్తోంది. పేర్లలో తేడాలు ఉన్న వారు ఆధార్ సెంటర్ల బాట పడుతున్నారు. అప్‌డేట్ కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ కేంద్రాలు దూర ప్రాంతాల్లో ఉండటంతో చాలా మంది అప్లై చేసుకోలేక పోతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను స్కాలర్‌షిప్ కోసం ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు మొత్తం 7,353 మంది మాత్రమే ఫ్రెష్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో ఎస్టీ విద్యార్థులు 2,654 మంది ఉండగా, బీసీలు 3,029 మంది, ఈడబ్ల్యూఎస్ 57 మంది, మైనారిటీలు 862 మంది ఉన్నారు. ఇక ఎస్సీ విద్యార్థులు కేవలం 751 మంది మాత్రమే ఉండడం గమనార్హం.

నిబంధన తొలగించాలి



స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎస్సీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పదోతరగతి మెమో, ఆధార్ కార్డులో పేరు ఒకేలా ఉండాలన్న నిబంధనతో చాలా మంది ఉపకార వేతనానికి దూరమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం చొరవ చూపి ఈ నిబంధనను తొలగించాలి.
– బోయిడి ఆకాశ్, ఏబీవీపీ జిల్లా నాయకుడు

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే..

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనానికి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. పదో తరగతి మెమోలో, ఆధార్‌లో విద్యార్థి పేరు ఒకేలా ఉండాలి. లేకుంటే ఆధార్‌లో మార్పు చేసుకోవాలి.
– సునీత, జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

వ్యాపారి ఇంట్లో చోరీ

నార్నూర్: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి పుష్కర్ జ్ఞానోబా ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. సదరు వ్యాపారి రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా కుంభమేళాకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు అపహరించారు. విషయం తెలుసుకున్న సీఐ రహీంపాషా వ్యాపారి బంధువుల సమక్షంలో ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా సాక్ష్యాలను సేకరించారు. దొంగలను అతి త్వరలో పట్టుకుంటామని తెలిపారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆటో, బైక్ ఢీ

తాంసి: మండలంలోని వడ్డాడి ఎక్స్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై ఆదివారం ఉదయం బైక్ ఢీకొట్టడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. సుంకిడి నుంచి ఆదిలాబాద్‌కు కూరగాయలతో బయలుదేరిన ఆటోను ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న తాంసికి చెందిన గంగారాంకు తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడితో పాటు ఆటో డ్రైవర్, రవి అనే మరోవ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

తానూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బెల్‌తరోడా సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై శాముల్ తెలిపారు. మహారాష్ట్రలోని భోకర్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్న వాహనాన్ని బెల్‌తరోడా చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా అందులో రూ.3 లక్షల నగదు పట్టుబడింది. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై శాముల్ తెలిపారు. ఎవరైనా రూ.50 వేలకు మించి డబ్బు తరలించవద్దని, ఒకవేళ తీసుకువెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

విలేకరులమని బెదిరించి అక్రమ వసూళ్లు

వేమనపల్లి: విలేకరుల ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. గోదావరిఖనికి చెందిన జక్కుల శ్రీధర్, మొగిళి అనిల్ ఆదివారం సుంపుటంలో ఆరు ఎడ్లను కొనుగోలు చేసి వ్యాన్‌లో పెద్దపల్లి పశువుల సంతలో అమ్మడానికి తీసుకెళ్తున్నారు. చొప్పదండి జనార్దన్, తుంగ రమేష్, మాసాని రమేష్, తోడేటి సంతోష్, జిల్లపల్లి పోశం, తగరం వెంకటేశ్, దొబ్బల విష్ణు తెల్లవారుజామున కారులో వచ్చి వ్యాన్‌ను అడ్డుకున్నారు. అనుమతి లేకుండా పశువులను తీసుకెళ్తున్నారని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. మీరు ఈ ప్రాంతంలో వ్యాపారం చేయకుండా చేస్తామని భయభ్రాంతులకు గురిచేశారు. జక్కుల శ్రీధర్, మొగిళి అనిల్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈవో, సిబ్బంది



కల్యాణానికి హాజరైన భక్తులు

కమనీయం.. సత్యదేవుని కల్యాణం

- హాజరైన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



సత్యదేవుని కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

దండేపల్లి: భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీసత్యనారాయణస్వామి రమా సమేతుడయ్యాడు. వేలాదిమంది భక్తులు తన్మయత్వంతో చేసిన గోవిందనామ స్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం గుట్టపై వెలసిన శ్రీసత్యనారాయణస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గుట్టపై ప్రధాన ఆలయం పక్కన సామూహిక వ్రత మండపంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై శ్రీసత్యనారాయణస్వామి–రమాదేవి వివాహ ఘట్టం ఆవిష్కృతమైంది. యాజ్ఞికులు అభిరామా ఆచార్యత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు రఘుస్వామి, సంపత్‌స్వామి ఆధ్వర్యంలో వేలాది మంది భక్తుల మధ్య, గోధూళిక సుముహూర్తమున మాంగల్యధారణ చేశారు. వివాహ తంతులో భాగంగా యజ్ఞోపవీత ధారణ, జీలకర్ర బెల్లం, కన్యాదానం వంటి కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి ఆలయం తరఫున ఈవో శ్రీనివాస్, సిబ్బంది పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వేడుకలకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

బాసర గోదావరికి హారతి



గోదావరికి హారతి ఇస్తున్న వేదభారతి పీఠం విద్యార్థులు

బాసర: నిర్మల్ జిల్లాలోని బాసర గోదావరి నదీ తీరాన మాఘమాసం ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం వేదభారతి పీఠం ఆధ్వర్యంలో గంగాహారతి కార్యక్రమం నిర్వహించారు. దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన కాశీలో చేపట్టే గంగాహారతి తరహాలో చదువులతల్లి కొలువున్న బాసరలో ప్రవహిస్తున్న పవిత్ర గోదావరినదికి హారతిపట్టారు. వేకువజామున గోదావరి హారతి, గుగ్గిల హారతి, ధూప దీప నైవేద్య హారతి, చతుర్దశ భువన హారతి ఇచ్చారు. వేద విద్యానందగిరి స్వామి చేతుల మీదుగా గంగమ్మ తల్లికి దీపం వెలిగించారు.

భక్తుల సందడి

సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర, కర్ణాటక, తదితర రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు చేయించారు.



బాసర ఆలయంలో భక్తుల సందడి

బైక్ పైనుంచి పడి బాలుడు మృతి



అనిల్ (ఫైల్)

భైంసారూరల్: బైక్ పైనుంచి కిందపడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు కుభీర్ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన గంగాధర్‌రోళ్ల మల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఎనిమిది నెలలుగా వానల్‌పాడ్‌లో ఉంటూ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుంటాల మండలంలోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మల్లయ్య కుమారుడు అనిల్ (14) శనివారం ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం తండ్రి పంట పొలానికి వెళ్లడంతో ద్విచక్ర వాహనాన్ని గ్రామ శివారులోకి తీసుకెళ్లి నడిపేందుకు ప్రయత్నించగా కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి భైంసా ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లి: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న బార్‌లో ఓ యువకుడిపై బీరు సీసాలతో దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అరెస్టు వివరాలు వెల్లడించారు. ఈనెల 7న కాల్‌టెక్స్‌లో ఉన్న బార్‌లో మద్యం సేవించేందుకు వెళ్లిన తాండూర్ గ్రామానికి చెందిన బండారి వంశీపై అల్లిసాగర్, రత్నం సోమయ్య, మామిడి అన్నమయ్య మూకుమ్మడిగా బీరు సీసాలతో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. సమావేశంలో టూటౌన్ ఎస్సై కె.మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్ కాలనీకి చెందిన చింతల గణేశ్ (25)కు మూడేళ్ల క్రితం భార్యతో విడాకులయ్యాయి. అప్పటినుంచి ఏపనీ చేయకుండా తల్లివద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శనివారం మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆమెతో గొడవకు దిగడంతో అదేకాలనీలో ఉంటున్న కూతురు ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉన్నాయి. ఎంత పిలిచినా తీయకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని తల్లి రుకుంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తర్వులతో సరి!

- గల్ఫ్ మృతుల కుటుంబాలకు అందని ఆర్థిక సాయం
- ప్రొసీడింగ్‌లకే పరిమితమైన సర్కారు ఆదేశాలు
- నిధులు విడుదల చేయకపోవడంతో ఖాతాల్లో చేరని సొమ్ము
- నిరాశ చెందుతున్న బాధిత కుటుంబాలు

నిర్మల్ జిల్లా భైంసా ప్రాంతానికి చెందిన మెండోళ్ల సుధాకర్ కొన్నాళ్ల క్రితం బహ్రెయిన్‌లో మృతి చెందాడు. అతని భార్య అనితకు ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సాట్ల నర్సయ్య అనే వ్యక్తి దుబాయిలో మృతి చెందగా అతని భార్య సుగుణకు సైతం ఎక్స్‌గ్రేషియాకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరికీ డిసెంబర్‌లోనే ప్రొసీడింగ్స్ అందాయి. నెలలు గడుస్తున్నా సర్కారు సాయం ఖాతాలకు చేరడం లేదు. ఈ ఇద్దరికే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఇప్పటికీ ఎక్స్‌గ్రేషియా అందని పరిస్థితి.



ఎక్స్‌గ్రేషియా మంజూరు ఉత్తర్వులు అందిస్తున్న భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గల్ఫ్ దేశాల్లో ఏ కారణం చేతనైనా మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందిస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ హామీని నిలబెట్టుకోవడానికి చర్యలు చేపట్టింది. 2023 డిసెంబర్ 7 తర్వాత గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వారి వివరాలను సేకరించి బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని నిర్ణయించింది. తొలి విడతలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రెండు బాధిత కుటుంబాలకు సాయం అందించారు. ఆ ఉత్తర్వులకు కొనసాగింపుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 129 కుటుంబాలకు రూ.6.45 కోట్లు విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మరో ఉత్తర్వు జారీ చేశారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను గుర్తించి, సాయం నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రొసీడింగ్‌లను అందించారు. నిధులు విడుదల చేయని కారణంగా లబ్ధిదారులకు ఇప్పటికీ నయా పైసా సాయం అందకపోవడంతో బాధిత కుటుంబాలు నిరాశ చెందుతున్నాయి. త్వరగా సాయం అందేలా చూడాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యం తగదు

గల్ఫ్ మృతుల కుటుంబాలకు భరోసా ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహించడం తగదు. గల్ఫ్ మృతుల్లో అందరూ పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఉన్నారు. సాయం సొమ్మును వెంటనే ఖాతాల్లో జమ చేయాలి.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు

గల్ఫ్ మృతుల కుటుంబాలకు కేటాయించిన సొమ్ము వివరాలు

జిల్లా	కేటాయించిన నిధులు (రూ.లలో)
నిజామాబాద్	1.75 కోట్లు
జగిత్యాల	1.40 కోట్లు
రాజన్న సిరిసిల్ల	60 లక్షలు
నిర్మల్	50 లక్షలు
కామారెడ్డి	20 లక్షలు
కరీంనగర్	20 లక్షలు
మంచిర్యాల	20 లక్షలు
ఆదిలాబాద్	20 లక్షలు
హన్మకొండ	20 లక్షలు
భద్రాద్రి కొత్తగూడెం	20 లక్షలు
పెద్దపల్లి	20 లక్షలు
మెదక్	20 లక్షలు
సిద్దిపేట	20 లక్షలు
సంగారెడ్డి	20 లక్షలు
హైదరాబాద్	20 లక్షలు
మొత్తం	6.45 కోట్లు

శిలాజాలు ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి



శిలాజాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వేమనపల్లి: సుంపుటం సమీపంలో ఉన్న ప్రాణహిత రేవు ప్రాంతంలో ఉన్న శిలాజాలను ధ్వంసం చేసిన వ్యక్తులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ డిమాండ్ చేశారు. శిలాజ సంపద ధ్వంసం శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన బీజేపీ శ్రేణులు ప్రాణహిత తీరం, మత్తడి వాగు వంతెన వద్దకు వెళ్లి పరిశీలించారు. శిలాజాలను మళ్లీ అక్కడికే తరలించాలని కోరారు.

యెంగన్న చెరువును సందర్శించిన శిక్షణ ఎఫ్ఎస్‌వోలు



యెంగన్న చెరువువద్ద అటవీశాఖ అధికారులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి అటవీ క్షేత్రం పరిధిలో ఉన్న పొన్కల్ యెంగన్న చెరువును ఆదివారం 32 మంది శిక్షణ అటవీశాఖ సెక్షన్ అధికారులు సందర్శించారు. శిక్షణలో భాగంగా హైదరాబాద్ నుండి వచ్చిన వారికి తుర్కం చెరువు, యెంగన్న చెరువులో ఉండే పక్షుల జాతులు, జంతువులు, అటవీ ప్రాంతంలో లభించే చెట్ల రకాలను గురించి స్థానిక అటవీశాఖ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ గంగారెడ్డి, పొన్కల్ ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, బీట్ అధికారి లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలి

- మాలీ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు విలాస్‌రావు పాటిల్



మాట్లాడుతున్న విలాస్‌రావు పాటిల్

ఆదిలాబాద్‌రూరల్: మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని మాలీ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు విలాస్‌రావు పాటిల్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని యాదవ సంఘ భవనంలో ఆదివారం మాలీ సంఘం మహా సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఏపీలో మాలీలు ఎస్టీలుగా కొనసాగుతున్నారని, తెలంగాణలో మాత్రం ఆహోదా రాలేదన్నారు. ఎస్టీ హోదాతో పాటు మహనీయుల జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చేలా జాతీయ సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలేను కీర్తిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు డాక్టర్ శ్యాంరావు పూలే, న్యాయవాది కైలాష్ వాగేల, రాజేందర్ మహాడోలే, సుకుమార్ పెట్కూలే, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శింబే, ఉపాధ్యక్షులు సురేష్ గుర్నూలే, కోశాధికారి సతీష్ గుర్నూలే, మహిళా సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు వినోద నగోషే, జిల్లా అధ్యక్షురాలు ఉజ్వల ఉమేర్రావు డోలే, యువజన విభాగం అధ్యక్షుడు నందకిషోర్, ప్రధాన కార్యదర్శి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఇచ్చోడ: 1972-73 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు



రామకృష్ణాపూర్:1983-84 బ్యాచ్ విద్యార్థులు



మందమర్రిరూరల్: 1999-2000 బ్యాచ్ విద్యార్థులు



బెల్లంపల్లి: 1990-91 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

ఇచ్చోడ/రామకృష్ణాపూర్/బెల్లంపల్లి/మందమర్రిరూరల్: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1972–73 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 52 ఏళ్ల తర్వాత, మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్ విద్యార్థులు 41 ఏళ్ల తర్వాత, బెల్లంపల్లిలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత, మందమర్రి పట్టణంలోని శ్రీసరస్వతి హైస్కూల్‌లో 1999–2000 బ్యాచ్ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. నాడు తమకు చదువుచెప్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. చిన్ననాటి చిలిపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు.

జీసీసీ గోదాంలో అగ్ని ప్రమాదం



గోదాంలో చెలరేగుతున్న మంటలు

- కాలిబూడిదైన గన్నీసంచులు
- సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తి నష్టం

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న జీసీసీకి సంబంధించిన గన్నీ సంచుల నిలువ గోదాంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐటీడీఏ క్వార్టర్స్ పక్కన ఉన్న జీసీసీ గోదాం నుంచి సాయంత్రం ఒక్కసారిగా పొగతో పాటు మంటలు లేచాయి. అప్రమత్తమైన స్థానికులు ఫైర్‌స్టేషన్, జీసీసీ అధికారులకు సమాచారం అందించారు. స్థానిక అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు యత్నించారు. భారీగా మంటలు ఎగిసి పడడంతో ఇచ్చోడ ఫైరింజన్ కూడా రప్పించారు. అయితే అప్పటికే భారీగా సంచులు కాలి బూడిదయ్యాయి. గోదాంలో సుమారు 90 వేల వరకు గన్నీ సంచులు ఉన్నట్లు గోదాం క్లర్క్ చందూలాల్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.25 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మూడు నెలల క్రితమే డీఆర్ డిపోలకు బియ్యం సప్లయ్ చేసే గన్నీ సంచుల వేలం నిర్వహించి వాటిని భద్రపరిచినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.